

# మానసమయూరి

## – కస్తూరి మురళీకృష్ణ



*(గత సంచిక తరువాయి)*

**అతడివైపు** ఆశ్చర్యంగా చూసింది ప్రశాంతి.

‘మీరన్నది అర్థంకాలేదు’ అంది.

‘నాకూ ఇప్పుడే అర్థమయింది. ఇన్నిరోజులూ ఎన్నో అర్థంకాని విషయాల వెంటబడి అవే అర్థవంతం అని భ్రమపడుతూ వస్తున్నాను. ఇప్పుడే అర్థమయింది.’

‘ఏమర్థమయింది?’ ఆమె ప్రశ్నలో ‘మీకు పిచ్చిపట్టలేదు కదా!’ అన్న ప్రశ్న అంతర్లీనంగా ఉంది.

‘చెప్తాను. నీకు కాకపోతే ఇంకెవరికి చెప్తాను’ ఆమెను దగ్గరకు తీసుకున్నాడు శరత్.

‘సుమంత్ ఆస్తి అడిగాడు చూడూ.. అప్పుడు అర్థమయింది. బృహదరణ్యక్ ఉపనిషత్తులో యాజ్ఞవల్క్యుడు చెప్పిన గొప్ప నిజం. ఈ ప్రపంచంలో ఎవరూ ఎవరికి ఏమీ కారు. భార్య భర్తను ప్రేమించటం, భర్త భార్యను ప్రేమించటం, తల్లి పిల్లలను ప్రేమించటం, పిల్లలు తల్లిదండ్రులను ప్రేమించటం.. ఇదంతా భ్రమ. అసలు నిజం వ్యక్తి తనని తాను ప్రేమించుకోవటం. స్వార్థం ఈ ప్రపంచం పరమార్థం. ఆలోచించు.. ఈ ప్రపంచంలో గొప్ప వ్యక్తులంతా స్వార్థపరులే. గొప్ప గొప్ప పనులు సాధించిన వారంతా స్వార్థపరులే. మిగతా ప్రపంచాన్ని విస్మరించి, ఎవరినీ పట్టించుకోక తమకు కావాల్సిన దానిపైనే దృష్టిపెట్టిన వారే ఏదైనా సాధిస్తారు. అలాకాక, అందరినీ పట్టించుకుని, అన్నీ తనవనుకుని, ఇతరుల కోసం తన ఇష్టాన్ని త్యాగం చేసేవాడు గొప్ప త్యాగశీలిగా పేరు పొందవచ్చు.. కానీ ఎందుకూ పనికిరానివాడవుతాడు. ఈ నిజం నాకు గ్రహింపుకు వచ్చింది. ఎంతో స్వేచ్ఛను సాధించినట్టు అనిపిస్తోంది. ఎంతో గొప్ప జ్ఞానం సంపాదించినట్టు తోస్తోంది.’

‘ఏమైంది మీకు? డాక్టర్ దగ్గరకు వెళ్దామా?’

‘నేను భ్రమలో, పిచ్చిలో ఉన్నంతకాలం నీకు ఏమీ అనిపించలేదు. ఇప్పుడు నిజం గ్రహించి విజ్ఞానవంతుడనయినప్పుడు నీకు పిచ్చివాడిలా కనిపిస్తున్నానా?’

‘కాదు.. ఏమేమో మాట్లాడుతున్నారు.’

‘ప్రశాంతీ ఇన్నాళ్ళూ మనం వేరేవారికోసం బ్రతికాము. వేరేవారి ఇష్టాలను అనుసరించి బ్రతికాము. ఉద్యోగం చేశాము. ఎవరికోసం? డబ్బుల కోసం. డబ్బులెందుకు? మనం సుఖంగా బ్రతికేందుకు. పిల్లలను చదివించేందుకు. వాళ్ళ జీవితాలు సుఖమయం చేసేందుకు. ఇందులో మనం మనకిష్టమైనది ఏం చేశాం? చెప్పు నీకిలా నాలుగుగోడల మధ్య కూర్చుని, రోజూ ఆఫీసుకి వెళ్ళొస్తూ, నెల తిరగగానే జీతం తీసుకుని మళ్ళీ నెలకోసం ఎదురుచూస్తూ ఇలాగే ఉండాలని ఉందా? ఇదే జీవితం అనిపిస్తోందా? అన్నీ వదిలి ఎక్కడికయినా వెళ్ళిపోవాలనిపించలేదా? అడవుల నడుమ తిరుగుతూ, కొండలెక్కుతూ, నదుల్లో ఈదుతూ.. చీకూ చింతాలేకుండా, భయభ్రాంతులు లేకుండా బ్రతకాలని లేదా? ఇదేనా మన జీవితం?’

ప్రశాంతి మాట్లాడలేదు.

'ప్రశాంతీ.. మనం ఒక చట్రంలో ఇమిడి అందులోనే కొట్టుమిట్టాడుతున్నాం. అది మన అశాంతికి మూలం. ఎందుకంటే మనం మనలా బ్రతకటంలేదు. అది మన అసంతృప్తికి మూలం. ఇప్పటికీ మించిపోలేదు. ఇప్పటినుంచీ మనం మనలాగా బ్రతుకుదాం. మనకు ఎలా ఇష్టమైతే అలా బ్రతుకుదాం. మన సమస్య ఏమిటో తెలుసా ప్రశాంతీ, మనం అన్నీ మనవి అనుకుని భ్రమపడతాం. మనం లేకపోతే గడవదని మనల్ని మనం మభ్యపెట్టుకుంటాం. మనల్ని మనం బంధనాలలో ఒదిగేట్టు చేసుకుంటాం. ఇవాళ్ళ మన పిల్లలు గొప్ప జ్ఞానాన్ని ఇచ్చారు. ఇక మనకు బాధ్యతలు లేవు. బంధాలు లేవు. డబ్బు మనిద్దరికీ సరిపడా ఉంది. చెప్పు నీకు ఎలా బ్రతకాలని ఉంది?'

బిత్తరపోయి చూస్తోంది శరత్ వైపు ప్రశాంతి.

మనిషి స్వేచ్ఛను కోరుకుంటాడు. విముక్తి కోరుకుంటాడు. రెండూ ఒకేసారి లభిస్తే ఏం చేయాలో తెలియదు. అలాంటి స్థితిలో ఉంది ప్రశాంతి.

'ప్రశాంతి.. నాకయితే అనాథ శరణాలయం స్థాపించాలని ఉంది. ఎవరూ లేని వారిని 'నేనున్నా'నని దగ్గర తీయాలని ఉంది.'

'ఇదీ బంధనమే కదా?' అడిగింది ప్రశాంతి.

'కావచ్చు. కానీ నాకిష్టమైన బంధనం. ఎవరో నాపై మోపిన బంధం కాదు. ఇంతకాలం వేరేవారు నాపై విధించిన బంధనాలలో ఒదిగాను. ఇకపై నేను అలా ఒదగదలచుకోలేదు.'

'కానీ...'

'కానీ.. అన్న పదం వచ్చిందంటేనే మనపై మనం సంకెళ్ళు విధించుకుంటున్నట్టు. ఈ ప్రపంచంలో ఎంతమంది అనాథలు ఉన్నారో ఆలోచించు. ఒక ప్రేమపూర్వకమైన పదం కోసం, గుప్పెడు తిండికోసం, ఎంతగా తపిస్తున్నారో ఆలోచించు. వాళ్ళ దుస్థితిని ఆసరాగా తీసుకుని వాళ్ళ జీవితాలతో ఎందరో చెలగాటం ఆడుతున్నారు. అలాంటి అనాథలకు ఆశ్రయం ఇద్దాం. మనం ఇవ్వాల్సిన ప్రేమని పంచుదాం. ఆలోచించు. మనం మనపై సంకెళ్ళు విధించుకున్నప్పుడు మనకు ఇద్దరే పిల్లలు. వాళ్ళే మన ప్రపంచం. వాళ్ళని దాటి మనం చూడలేకపోయాం కానీ ఇప్పుడు మనం స్వేచ్ఛ పొందినపుడు ప్రపంచంలోని పిల్లలంతా మనవారే. ప్రపంచమంతా మనదే'

'కానీ.. ఇందాక స్వార్థం మంచిదన్నారు?'

'ఇదంతా నా స్వార్థమే. నాకు ఇలాగే ఉండాలని ఉంది. నీకు గుర్తుందా.. నేనెప్పుడూ ఒక పాడేవాడిని.

**హాథ్ థే మిలే వో జుల్ఫ్ చాంద్‌కీ సవాల్ దూ**

**హాథ్ ధే ఖులీ కె హర్ బహార్ కోప్పవార్ దూ**

**దర్ద్ థా దియా గయా కె హర్ దుఖీ కాస్పార్ దూ**

**ఔర్ సాంస్ యూ కె స్వర్గ్ భూమి పర్ ఉతార్ దూ...**

ఇన్నాళ్ళకి ఈ కలను నిజం చేసుకునే అవకాశం వచ్చింది. ఇక నేనీ ఉద్యోగం చేయను. ఇక ఈ భ్రమలో ఉండలేను. చేయిసాచి సాటి మానవుల వేదనను అందుకుంటాను. కన్నీరు తుడుస్తాను. నాకు ఉన్నది అందరితో పంచుకుంటాను. ఇదే నా కోరిక. నీ ఇష్టం ఏమిటి?' అడిగాడు.

ఆమె మౌనంగా ఉంది

'మీరు ఉద్యోగం మానేసి అనాథల సేవ చేయండి. నేను ఓపిక ఉన్నంతవరకూ ఉద్యోగం చేసి మీ అనాథశరణాలయానికి నా జీతం విరాళంగా ఇస్తాను నెలనెలా' అంది.

'ప్రశాంతీ' అన్నాడు శరత్ ఆమెని దగ్గరకి తీసుకుంటూ..

**అప్నీ ఖుదీ కా జో సమ్ ఝూ**
**ఉస్‌నే ఖుదా కా పహచానా**
**ఆజాద్ ఫిత్రీతె ఇన్సాన్**
**అందాజ్ క్యూ గులామానా**
**సర్ యే నహీ ఝువానే కే లియా**
**తూ జీ పయ్ దిల్ జమానేకేలియే**
**అప్‌నే లియే జియ్‌తో క్యాజియే**

తనని తాను అర్థం చేసుకున్నవాడు, భగవంతుడిని తెలుసుకున్నవాడు. మనిషి మౌలిక లక్షణం స్వేచ్ఛ. అలాంటప్పుడు బానిసలా ఎందుకు ఉండాలి? ఈ శిరస్సు ఎందుకని ఎవరిముందయినా వంగాలి? ప్రపంచమే తనదిగా జీవించేవాడే అసలయిన మనిషి. అదే అసలయిన స్వార్థం.

*(సమాప్తం)*

Post your comments